
సాక్షి ఒడిశా

శుక్రవారం । 2 । మే । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,24,102లు, బంగారం 1 గ్రాముల 450 మిల్లీగ్రాములు, వెండి 30 గ్రాముల 500 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



అట్టడుగు వర్గాల అభివృద్ధికి కృషి

అట్టడుగు స్థాయి ప్రజలకు ప్రభుత్వ సేవలు అంకితం చేస్తున్నామని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ప్రకటించారు.

- 8లో ▸



పెళ్లి ఊరేగింపులో పాములు

పెళ్లి ఊరేగింపులో నాగుపాములను ప్రదర్శించిన ఘటన భద్రక్ జిల్లా ధామ్రా బంశద గ్రామ పంచాయతీ ఛెడకా గ్రామంలో చోటుచేసుకుంది.

- 8లో ▸

న్యూస్‌రీల్

కారు డ్రైవర్‌కి కలెక్టర్ సత్కారం



కారు డ్రైవర్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ శుభంకర్ మహాపాత్రో

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కలెక్టర్ తన కిందిస్థాయి ఉద్యోగులకు పెద్ద ప్రాధాన్యత ఇచ్చారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి తన కారు డ్రైవర్ కె.వెంకట రావుకు ఉద్యోగ విరమణ వీడ్కోలు పలికారు. వాస్తవానికి బుధవారం సాయంత్రం వెంకటరావు ఉద్యోగ విరమణ చేశారు. గురువారం ఆ విషయం తెలుసుకున్న కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రో మరలా వెంకటరావుని కలక్టరేట్‌కు పిలిపించుకున్నారు. ప్రత్యేక మెమెంటో ఇచ్చి శాలువా కప్పి సన్మానించారు. వెనువెంటనే తాత్కాలిక పెన్షన్ ఆర్డర్స్ అందజేశారు. కలెక్టరేట్ సిబ్బంది, ఉన్నతస్థాయి అధికారులు కరచలనాలు మధ్య వెంకటరావుకి వీడ్కోలు పలికారు.

చీపురు పట్టి..శుభ్రం చేసి..



జాతర ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి

కొరాపుట్: నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి చీపురు పట్టి ప్రజల్లో అవగాహన కల్పించారు. సిందిగుడ గ్రామంలో బలి జాతర ఏర్పాట్లు పర్యవేక్షించడానికి వెళ్లారు. అక్కడ దేవతా మూర్తులు ఉంచే మైదానం ఇంకా చెత్త చెదారం తో ఉండటాన్ని గమనించారు. వెంటనే చీపురు పట్టుకొని ఊడ్చడం ప్రారంభించారు. ఇది గమనించిన స్థానికులు, బీజేపీ కార్యకర్తలు కూడా వెనువెంటనే చీపర్లు పట్టుకొని దేవాత ప్రాంగణాన్ని శుభ్రపరిచారు.

గుడ్లగూబను రక్షించిన నర్సరీ సిబ్బంది



గాయపడిన గుడ్లగూబ

కొరాపుట్: ప్రమాదవ శత్తు గాయపడిన గుడ్ల గూబను నర్సరీ సిబ్బంది రక్షించారు. కొరాపుట్ జిల్లా నందపూర్ సమితి రాణి డుడుమా అటవీ శాఖ నర్సరీలో అరుదైన గుడ్ల గూబ గాయాలతో పడి ఉండటాన్ని సిబ్బంది గురువారం గమనించారు.ఈ విషయం నందపూర్ అటవీ శాఖాధికారి గోపి నాథ్ పంగికి సమాచారం ఇచ్చారు. అతను సిబ్బందితో అక్కడికి చేరుకొని గుడ్ల గూబను పశువైద్యుల వద్దకు తీసుకొని వెళ్లి చికిత్స చేయించారు.అది కోలుకున్న తర్వాత అటవీ ప్రాంతంలో విడిచి పెడతామని ప్రకటించారు.

గురువు కోసం 80 కిలోమీటర్ల కావిడి యాత్ర



అలేఖ్‌బాబా గురువు గౌరంగ్‌కి వందనం చేస్తున్న శిష్యులు

కొరాపుట్: గురువుపై అభిమానాన్ని గొప్పగా చాటుకున్నారు ఆ శిష్యులు. గురువు ఆరోగ్యం బాగుపడాలని కోరుకుంటూ మండుటెండలో 80 కిలోమీటర్ల మేర కావిడిలో మోసుకుంటూ పాదయాత్ర చేశారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బస్తర్ జిల్లాలో అలేఖ్‌మాత ఆశ్రమ బాబా అవదూత గౌరంగ్ చరణ్ బాబా ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. బాబాకు చికిత్స అవసరమని శిష్యులు భావించారు. అయితే బాబాగా మారిన గురువు యంత్రంతో ఉన్న వాహనం ఎక్కడం అలేఖ్ బాబా మత సంప్రదాయానికి విరుద్ధం. అందుకే శిష్య బృందం కావిడి ఏర్పాటు చేసి అందులో గురువును కూర్చోబెట్టారు. నదులు, కొండలు, అడవులు దాటి సుమారు 80 కిలోమీటర్ల దూరం మోసుకుంటూ పాదయాత్ర చేపట్టారు. నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ పట్టణంలోని ఓ ప్రవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. గురువు కోలుకొన్న తర్వాత బుధవారం తిరుగు ప్రయాణం ప్రారంభించారు.

కదలివచ్చిన.. కార్మిక లోకం



రాయగడ: లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు కొండబాబు నేతృత్వంలో కార్మికుల ర్యాలీ

రాష్ట్ర వ్యాప్తంగా గురువారం మే డేను కార్మికులు ఘనంగా జరుపుకొన్నారు. కార్మిక హక్కుల సాధనకు ఐక్యపోరాటాలు అవసరమని సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ప్రభుత్వాలు స్పందించి కార్మికుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని, ప్రత్యేక పథకాలు అమలు చేయాలని నినదించారు. ఈ సందర్భంగా పరిశ్రమలు, యూనియన్ కార్యాలయాల వద్ద అరుణ పతాకాలను ఎగురవేశారు. అనంతరం పలుచోట్ల ఎమ్మెల్యేలు, అధికారుల చేతుల మీదుగా కార్మిక కుటుంబాలకు సాయం అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్



కొరాపుట్: నబరంగ్‌పూర్‌లో మేడే ఉత్సవాలు ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎలు గౌరీ శంకర్ మజ్జి, నర్సింగ్ భోత్ర లు



పర్లాకిమిడి: శ్రామిక దినోత్సవంలో ఎమ్మెల్యే, కలెక్టర్, పురపాలక అధ్యక్షురాలు



రాయగడ: ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే కద్రక, అదనపు జిల్లా కలెక్టర్ నాయక్ తదితరులు



రాయగడ: వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కార్మికులు



రాయగడ: గుణుపూర్‌లొ సీపీఐ (ఎంఎల్) ర్యాలీ



కొరాపుట్: పపడాహండిలో బాధిత కార్మిక కుటుంబానికి చెక్ అందజేస్తున్న సమితి వైస్ చెర్మన్ శుశాంత్ బెహరా



జయపురం: పట్టణంలో కార్మికుల ర్యాలీ



జయపురం: మెయిన్ రోడ్డులో మేడే నినాదాలు చేస్తున్న కార్మికులు



జయపురం: లోకల్ మేన్ కార్మిక యూనియన్ వద్ద మేడే వేడుకలు



జయపురం: కార్మిక కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేసిన న్యాయాధికారులు

తేనెపట్టు తోరణం!



ఇంటి గుమ్మం వద్ద తేనె పట్టు సమీపంలో వైద్యనాథ్

కొరాపుట్: ఎక్కడైనా తేనే టీగలను చూస్తూ ఎలాంటివారైనా భయపడతారు. తేనెటీగలు కుడితే ప్రాణాపాయం ఖాయం. అందుకే వీటికి దూరంగా ఉంటారు. అయితే నబరంగ్‌పూర్ జిల్లా బొడ మసిగాం గ్రామానికి చెందిన వైద్యనాథ్ నాయక్ కుటుంబ సభ్యులు రెండు నెలలుగా తేనెటీగలతోనే సావాసం చేస్తున్నారు. రెండు నెలల క్రితం చిన్న తేనే టీగలు ఇంటి ప్రధాన ద్వారానికి పట్టు కట్టడం ప్రారంభించాయి. దీన్నిచూసిన గ్రామస్తులు తేనే పట్టు ఇంటి ఆవరణలో పెడితే మంచిదని వైద్యనాథ్ కుటుంబ సభ్యులకు చెప్పారు. దీంతో భయం భయం గానే వైద్యనాథ్ కుటుంబం ఆ పట్టు ని ఉంచింది. రెండు నెలల్లో క్రమేణా పెద్ద పట్టుగా మారి వందలాది తేనే టీగలు వచ్చి చేరాయి. అయితే కుటుంబీకులకు ఇప్పటి వరకూ ఎలాంటి హానీ తలపెట్టలేదు. నిత్యం కుటుంబ సభ్యులు ద్వారం వద్ద ఒంగి లోపలకి వెళ్లడం, రావడం జరుగుతుంది.

బావిలో పడిన జింక



జింకకు శస్త్రచికిత్స చేస్తున్న సిబ్బంది



జింకను బావిలో నుంచి పైకి తీసుకొస్తున్న సిబ్బంది

కొరాపుట్ : నందపూర్‌లో తాగునీటి కోసం వచ్చిన ఓ జింక ప్రమాదవశాత్తు బావిలో పడింది. వెంటనే గ్రామస్తులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఓఐసీ చిత్త రంజన్ పంజియా నేతృత్వంలో బృందం బావిలోకి దిగి జింకని చాకచక్యంగా పైకి తీసుకొచ్చారు. అప్పటికే గాయాలు కావడంతో పశు వైద్యుడు అజిత్ కుమార్ చికిత్స చేశారు. అనంతరం అటవీ శాఖాధికారి టి.పండా తమ కార్యాలయానికి జింకను తరలించారు. పూర్తిగా కోలుకున్నాక సమీప అటవీ ప్రాంతంలో విడిచి పెడతామని ప్రకటించారు.

ధాన్యం డబ్బులు చెల్లించకపోతే పోరాటం



మాట్లాడుతున్న బుజబల్ మజ్జి

కొరాపుట్: రైతులకు ధాన్యం డబ్బులు అందకపోతే వారి తరపున పోరాటం చేస్తామని కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే భుజభల్ మజ్జి హెచ్చరించారు. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు నెలల క్రితం రాయిఘర్ సమితిలో 344 మంది రైతులకు చెందిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు. అయితే వారికి వెంటనే చెల్లించాల్సిన డబ్బులు ఇంత వరకు పడలేదన్నారు. ఇందులో నకిలీ రైతులు ఖాతాలు అత్యధికంగా ఉన్నాయన్నారు. అసలైన రైతుల డబ్బులు దళారుల ఖాతాలకు మళ్లాయని ఆరోపించారు. ఈ ఉదంతం పై జిల్లా యంత్రాంగం తక్షణ దర్యాప్తు చేయాలన్నారు. నిజమైన రైతులకు డబ్బులు అందకపోతే పోరాటం చేస్తామని భుజబల్ వెల్లడించారు. సమావేశంలో జెడ్పీ మెంబర్ డాక్టర్ లిఫికా మజ్జి, కాంగ్రెస్ నేతలు దిలిప్ బెహరా, ప్రదిప్ సాహు ఉన్నారు.

మహిళా న్యాయవాది మృతికి సంతాపం



నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

జయపురం: జయపురం పట్టణానికి చెందిన మహిళా న్యాయవాది సుజాత పాత్రో గురువారం అకాల మరణం చెందారు. ఈమె మృతికి కొరాపుట్ జిల్లా బార్ అసోసియేషన్ సభ్యులు తీవ్ర సంతాపం తెలియజేశారు. ఆమె మరణ సమాచారం అందిన వెంటనే జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులు సంతాప సభ నిర్వహించి ఆమె చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. న్యాయవాదిగా ఆమె సమాజానికి అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సరోజ్ దాస్, నవీణ సాహు, సచ్చిదానంద మిశ్ర పాల్గొన్నారు.

• చందన యాత్ర



శ్రీక్షేత్రంలో చందన యాత్ర ఆనందోత్సాహాలతో జరుగుతోంది. శ్రీ మందిరం నుంచి నరేంద్ర పుష్కరిణి వరకు మూల విరాటుల ప్రతినిధులుగా ఉత్సవ మూర్తులు పల్లకిలో చేరుతున్నాయి. దారి పొడవునా యాత్ర ఉత్సాహభరితంగా కొనసాగుతుండటంతో భక్తులు తన్మయత్వం చెందుతున్నారు.

- భువనేశ్వర్

ఉత్సాహంగా చందన యాత్ర ప్రారంభం



చందన్ చెరువులో విహారయాత్ర చేస్తున్న దేవదేవుళ్లు



ఊరేగింపులో గిరిజనులు



అలంకరించిన శబరి శ్రీ క్షేత్రం

కొరాపుట్: కొరాపుట్ జిల్లా కేంద్రంలోని శబరి శ్రీ క్షేత్రంలో చందన యాత్ర ప్రారంభమైంది. బుధవారం రాత్రి జిల్లా కేంద్రంలోని చందన్ పొఖ్రీ (చెరువు)లో దేవ దేవులైన జగన్నాథ, శుభద్ర, బలబద్రులు పడవ లో విహరించారు. వేసవి తాపల నుంచి చల్లబడడానికి చందనం పూసుకోని జల విహార యాత్ర చేశారు. ఇలా వరుసగా 21 రోజులు సాయంత్రం దేవ దేవుళ్లు జల విహార యాత్ర చేస్తారు. రోజూ జగన్నాథ గుడి నుంచి వేద పండితులు ఊరేగింపుగా దేవతా విగ్రహాలను తెచ్చి చందన చెరువులో జల విహారం చేయించి తిరిగి దేవాలయానికి తీసుకొని వెళ్తారు. గిరిజన తెగ అయిన సవరలు పూజించినందుకు ఈ క్షేత్రానికి శబరి క్షేత్రంగా పేరు వచ్చింది. చందన యాత్ర ఊరేగింపును గిరిజనులు తమ సంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. కార్యక్రమంలో కొరాపుట్ మున్సిపల్ చైర్మన్ లలెటెందు రంజన్ శెఠి, అధికసంఖ్యాలో భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సెంట్రల్ వర్సిటీ వీసీ రాజీనామా ఆమోదం


చక్రధర్ త్రిపాఠి

కొరాపుట్: కొరాపుట్ జిల్లా సునాబెడా సమీపంలో ఉన్న ఒడిశా సెంట్రల్ యునివర్సిటీ వైస్ చాన్సలర్ చక్రధర్ త్రిపాఠి రాజీనామా చేశారు. ఈ రాజీనామాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారు. గురువారం ఈయన స్థానంలో నర్సింగ్ చరణ్ పండాని నియమిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.

న్యాయవాది మృతికి సంతాపం

కొరాపుట్: న్యాయవాది సుజాత పాత్రో అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. గురువారం జయపూర్‌లోని కొరాపుట్ జిల్లా కోర్టుల సముదాయంలో సంతాప సభ నిర్వహించారు. బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరి భలోనాథ్ పట్నాయక్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

సునాబెడాలో అప్రమత్తం



సునాబెడాలో హాల్ మొదటి ద్వారం వద్ద ప్రస్తుత పరిస్థితి

కొరాపుట్: భారత్–పాక్ యుద్ధ వాతావరణ నేపథ్యంలో కొరాపుట్ జిల్లా సునాబెడాలో అప్రమత్తం చేశారు. యుద్ధ విమానాల ఇంజిన్లు ఇక్కడి హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్) తయారు చేసి అందిస్తుంది. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఐడెంటీ కార్డులు లేనిదే ఎవరినీ అనుమతించడం లేదు.

ఇస్కాన్ మందిరంలో పూజలు


ఇస్కాన్ గురువులను దర్శించుకుంటున్న కొట్‌పాడ్ ఎమ్మెల్యే రుపుధర్ భోత్ర

కొరాపుట్: కొట్‌పాడ్ ఎమ్మెల్యే రుపుధర్ బోత్ర ఇస్కాన్ మందిరాన్ని దర్శించుకున్నారు. గురువారం పట్టణంలో ఇస్కాన్ మందిరానికి వెళ్లి భగవతం ప్రవచనాలు ప్రారంభం కార్యక్రమంలో పాల్గొన్నారు. తాను సైన్యంలో పని చేస్తున్నప్పటి నుంచి ఇస్కాన్ సంస్కృతి కి గౌరవం ఇచ్చేవాడినని పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ అనంతర బీజేపీలో చేరిన తర్వాత ఇస్కాన్ పట్ల మరింత విదేయత పెరిగిందన్నారు.

పెళ్లి ఊరేగింపులో పాములు


పాములను తలపై పెట్టుకుని డ్యాన్స్ చేస్తున్న దృశ్యం

భువనేశ్వర్: పెళ్లి ఊరేగింపులో నాగుపాములను ప్రదర్శించిన ఘటన భద్రక్ జిల్లా ధామ్రా బంశద గ్రామ పంచాయతీ చెడకా గ్రామంలో చోటుచేసుకుంది. బుధవారం రాత్రి జరిగిన వివాహ ఊరేగింపులో మూడు పాములను తీసుకొచ్చి నృత్యాలు చేయించారు. విషయం తెలుసుకున్న భద్రక్ వన్య ప్రాణుల విభాగం బృందం ఘటనా స్థలానికి చేరుకుని పాములను ప్రత్యేక బోనులో భద్రపరిచారు. సమగ్ర దర్యాప్తు జరుగుతోందని, బాధ్యులపై చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని భద్రక్ మండల అటవీ అధికారి (డీఎఫ్‌ఓ) సౌభాగ్య కుమార్ సాహు తెలిపారు.

కల్యాణం.. కమనీయం


స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

రాయగడ: కొలనార సమితి అమలాభట్ట వద్ద గల శ్రీక్షేత్ర టౌన్ షిప్‌లో ఉన్న లక్ష్మీనృసింహుని సన్నిధిలో అక్షయ తృతియ పురస్కరించుకుని జరుగుతున్న చందనోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం కల్యాణోత్సవం అత్యంత వైభంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు మంగనాథ్ ఆచార్యులు, స్థానిక బాలాజీ నగర్‌లో గల కల్యాణ వేంకటేశ్వరుని ఆలయ ప్రధానార్చకులు భాస్కరాచార్యుల ఆధ్వర్యంలో జరిగిన కల్యాణోత్సవాలు సంప్రదాయ బద్ధంగా జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

అట్టడుగు వర్గాల అభివృద్ధికి కృషి

- బహుళార్థసాధక కార్మికుల విశ్రాంతి గదుల ప్రారంభంలో సీఎం మాఝి
- ఒడిశా శ్రామిక్ సాథీ మొబైల్ యాప్ ప్రారంభం


రాష్ట్ర స్థాయి కార్మిక దినోత్సవం సభలో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

భువనేశ్వర్: ప్రజల సంక్షేమం, అభివృద్ధికి అంకిత భావంతో పనిచేస్తున్నామని, ప్రధానంగా అట్టడుగు స్థాయి ప్రజలకు ప్రభుత్వ సేవలు అంకితం చేస్తున్నామని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ప్రకటించారు. కొత్త ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించిన తొలి రోజు నుంచి ఇదే దృక్పథంతో ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం సందర్భంగా స్థానిక ఓయూఏటీ వ్యవసాయ విద్యా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం ప్రసంగించారు. ఈ సందర్భంగా నగరంలో 2 బహుళార్థసాధక కార్మికుల విశ్రాంతి సముదాయాల్ని ప్రారంభించారు. స్థానిక డుమ్‌డుమా మరియు కల్పనా ప్రాంతాల్లో వీటిని ప్రారంభించారు. ఈ ప్రాంగణాల్లో కార్మికులకు తాత్కాలిక ఆశ్రయ సౌకర్యాలతో పాటు సురక్షిత తాగు నీరు, మరుగుదొడ్లు, పార్కులు వంటి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. రానున్న రోజుల్లో కటక్, రౌర్కెలా, సంబలపూర్, కెంజొహర్, బరంపురం వంటి ఇతర పట్టణ ప్రాంతాలలో కార్మికుల నిరీక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. కార్మికులు అకాల మరణానికి గురైతే అందజేసే మరణ పరిహారం మొత్తం పరిమితి పెంచినట్లు తెలిపారు. ఇకపై సాధారణ మరణానికి రూ. 2 లక్షల నుంచి రూ. 3 లక్షలు, ప్రమాదవశాత్తు మరణం సంభవిస్తే రూ. 4 లక్షల నుంచి రూ.6 లక్షలకు పరిహారం పరిమితి పెంచుతున్నట్లు ప్రకటించారు. నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకం కింద ఇప్పటివరకు దాదాపు 47 లక్షల మంది నిర్మాణ కార్మికులు నమోదు చేసుకున్నారు. వీరంతా వివిధ పథకాల కింద రూ.3,951 కోట్లకు పైగా సహాయం పొందారని వివరించారు. తాజాగా 4 లక్షలకు పైగా నిర్మాణ కార్మికులు నమోదు చేసుకుని రూ. 370 కోట్లకు పైగా సహాయం పొందారని తెలిపారు.

యాప్ ప్రారంభం..

మే సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 3,000 మంది అర్హులైన నిర్మాణ కార్మికులకు ఒకేసారి కొత్త గుర్తింపు కార్డుల్ని సీఎం జారీ చేశారు. వీరిలో అర్హత కలిగిన లబ్ధిదారులకు రూ. 40 కోట్లకు పైగా ముఖ్యమంత్రి సహాయం అందజేశారు. నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు వివిధ సేవలు కార్మికులకు చిటికెలో లభ్యం అయ్యేందుకు వీలుగా ముఖ్యమంత్రి ఒడిశా శ్రామిక్ సాథీ మొబైల్ యాప్‌ను ప్రారంభించారు. దీనివల్ల కార్మికులు ఇంటి నుంచే వివిధ సేవలను సులభంగా, సౌకర్యవంతంగా పొందగలుగుతారని సీఎం చెప్పారు. నిర్మాణ కార్మికులకు ఆన్‌లైన్ వర్కర్ రిజిస్ట్రేషన్, పునరుద్ధరణ, సహాయం కోసం దరఖాస్తు వంటి సేవలను పొందడంలో ఈ మొబైల్ యాప్ ఎంతో సహాయపడుతుందని తెలిపారు. వలస కార్మికులను గుర్తించి వారిని ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడానికి ఉప ముఖ్యమంత్రి అధ్యక్షతన ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీంతో పాటు ఒడియా వలస కార్మికుల కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో లోక్‌సభ సభ్యురాలు, ఎమ్మెల్యే, కార్మిక–ఉపాధి శాఖ మంత్రి, ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి పాల్గొన్నారు.

ఘనంగా రామ మందిర ప్రతిష్ట


భజనలు నిర్వహిస్తున్న జయపూర్ ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణిపతి


సీతారామలక్ష్మణ విగ్రహాలు

కొరాపుట్: కొరాపుట్ జిల్లా కేంద్రంలోని పుజారిపుట్‌లో రామ మందిర ప్రతిష్ట కార్యాక్రమం ఘనంగా నిర్వహించారు. గురువారం పెద్ద ఎత్తున భక్తులు సీతారామలక్ష్మణ విగ్రహాలను దర్శించురకున్నారు. జయపూర్ ఎమ్మెల్యే తారా ప్రసాద్ భాహిణిపతి ఆధ్వర్యంలో భజనలు నిర్వహించారు.మధ్యాహ్నం అన్న ప్రసాద సేవనం జరిగింది.

ఫైరింగ్‌లో శిక్షణ


అటవీ శాఖ సిబ్బందికి శిక్షణ


రైఫిల్స్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు


శిక్షణలో పోలీసులు

పర్లాకిమిడి: స్థానిక బెత్తగుడ రిజర్వుడు పోలీసు మైదానంలో మూడు రోజులపాటు అటవీ శాఖ ఏ.సి.ఎఫ అధికారులు, ఫారెస్టర్, ఫారెస్టు గార్డులకు ఆర్మ్‌డ్ శిక్షణ శిబిరాన్ని డి.ఎఫ్.ఓ. కె.నాగరాజు నేతృత్వంలో గురువారం నిర్వహించారు. గత నెల 29 నుంచి మూడురోజుల పాటు జరిగిన శిక్షణ శిబిరంలో రైఫిల్, ఇతర సామగ్రిపై అధికారులు శిక్షణ అందించారు. అటవీ శాఖ అధికారులు విధి నిర్వాహణలో ఆత్మరక్షణ, ఆపరేషన్ రెడీనెస్ కోసం శిక్షణ శిబిరం నిర్వహించినట్టు డీఎఫ్‌ఓ నాగరాజు తెలిపారు.

ఘనంగా బలి జాతర


బలి జాతరలో నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మఝి

కొరాపుట్: గిరిజనులు గ్రామ ఆరాధ్య దైవం శాంతి జరిపే బలి జాతర ఘనంగా జరిగింది. గురువారం నబరంగ్‌పూర్ జిల్లా నందాహండి సమితి సింధిగుడ గ్రామంలో వేలాది మంది గిరిజనులు ఈ జతర చేశారు. ధాన్యం కంకులతో గిరిజనులు భారీ ర్యాలీ చేశారు. అనేక సంవత్సరాలు తర్వాత జరుగుతుండడంతో గ్రామంలో ప్రతి ఇంట బంధువులు సందడి నెలకొంది. నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మఝి, డాబుగాం ఎమ్మెల్యే భుజబల్ మఝి, మాజీ ఎమ్మెల్యే సదాశివ ప్రదాని, తదితరులు జాతరలో పాల్గొన్నారు.


గ్రామస్తులతో డాబుగాం ఎమ్మెల్యే మనోహర్ రంధారి


అనుచరులతో ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సదాశివ ప్రదాని

15 కిలోల గంజాయి స్వాధీనం

- ఇద్దరు అరెస్టు


పోలీసులకు చిక్కిన నిందితులు

పర్లాకిమిడి: గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 15 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. గజపతి జిల్లాలోని మోహనా బ్లాక్ అడవ పోలీసుస్టేషన్ పరిధి హాడపోదా జంక్షన్ వద్ద ఇద్దరు వ్యక్తులు గంజాయిని అక్రమంగా తరలిస్తున్నారని అందుకున్న సమాచారం మేరకు దాడులు చేశామన్నారు. గంజాయి తరలిస్తున్న నిందితులు అడవ గ్రామానికి చెందిన రఘునాథ శెఠి, అజయ్ నాయక్‌లుగా గుర్తించామన్నారు.

21 ద్విచక్ర వాహనాలు స్వాధీనం!


పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

జయపురం: బైక్ దొంగల ఆట కట్టించేందుకు జయపురం పట్టణ పోలీసులు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా చోరీకి పాల్పడుతున్న వారిని గుర్తించి వారివద్ద నుంచి 21 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. కొంతమందిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు సమాచారం. కాగా ఈ విషయాన్ని పట్టణ పోలీసు అధికారి వల్లభ చంద్ర రౌత్ వద్ద ప్రస్తావించగా సమాదానం చెప్పేందుకు నిరాకరించారు. అయితే తగిన సమయంలో పూర్తి వివరాలు వెల్లడిస్తామంటున్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

నరసన్నపేట: మండలంలోని ఉర్లాం రైల్వేస్టేషన్ వద్ద పట్టాలు దాటుతుండగా ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ ఢీకొని గాయపడిన తుంగాన గోవిందరావు (48) గురువారం వేకువజామున మృతి చెందారు. బుధవారం ఉదయం ట్రైన్ ఢీకొనడంతో గాయాలపాలై న విషయం తెలిసిందే. శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు జీఆర్‌పీ హెచ్‌సీ మధుసూదనరావు తెలిపారు. కాగా మృతునికి భార్య అప్పలనర్సమ్మ, కుమారుడు మహేష్, కుమార్తె అనితలు ఉన్నారు.

కానిస్టేబుల్‌పై కేసు నమోదు

కాశీబుగ్గ: పలాస కోర్టుకు సంబంధించి వివిధ కేసుల్లో రికవరీ అయిన బంగారం, నగదును సొంతానికి వాడుకున్న విషయమై ఒక కానిస్టేబుల్‌పై కాశీబుగ్గ పోలీసుస్టేషన్‌లో గురువారం కేసు నమోదయ్యింది. సంబంధిత బాధితులకు అందాల్సిన రూ.10 లక్షలు, ఆరు తులాల బంగారం అందకపోవడంతో వారు కోర్టును ఆశ్రయించగా విషయం బయటపడింది. ఇదే విషయంపై కాశీబుగ్గ పోలీసుస్టేషన్ సీఐ సూర్యనారాయణకు వివరణ కోరగా, అతనిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

శాశ్వత పట్టాలు ఇవ్వాలి


సబ్‌కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన ఓసీసీ ప్రాంతవాసులు

- అధికారులకు ముండిగుడ వాసుల విజ్ఞప్తి

జయపురం: జయపురం సమితి బరిణిపుట్ పంచాయతీ ముండిగుడ ఒడిశా కన్‌స్ట్రక్షన్ కాలనీ(ఓసీసీ) ప్రాంతంలో 50 ఏళ్లుగా నివసిస్తున్న వారికి శాశ్వత ఇళ్ల పట్టాలు ఇవ్వాలని బీజేపీ నేత రవీంద్ర మహాపాత్రో కోరారు. మహాపాత్రో నేతృత్వంలో వందలాది మంది ఓసీసీ ప్రాంత నివాసులు జయపురం సబ్ కలెక్టర్‌కు గురువారం వినతి పత్రం సమర్పించారు. 2019లో ఆ ప్రాంత నివాసులైన 250 పైగా కుటుంబాల వారు ఇళ్ల పట్టాలు కోసం విజ్ఞప్తి చేశారన్నారు. జిల్లా కలెక్టర్ 49 కుటుంబాలకు బరిణిపుట్ పంచాయతీలో రెండు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలకు పట్టాలు మంజూరు చేశారని వెల్లడిచారు. అంతకు ముందు ఆ ప్రాంతంలో ఉంటున్న 250 కుటుంబాలకు భూమి పట్టాలు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని వినతి పత్రంలో గుర్తు చేశారు. అయితే వారికి 7 ఎకరాల 50 సెంట్ల భూమి చూసి అక్కడ ఇళ్లు కట్టుకోమన్నారన్నారు. అందుకు కొంతమంది అందుకు అంగీకరించలేదని వివరించారు. తరువాత కాలంలో ఆ డొంగర భూమిని చదును చేసి ఇళ్లు కట్టు కొనేందుకు అంగీకరించారని అందు చేత అచ్చట నివాసం ఏర్పరుకున్న వారికి శాశ్వత పట్టాలు సమకూర్చి ఆ గ్రామాన్ని రెవెన్యూ గ్రామంగా గుర్తించాలని సబ్‌కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

ట్రాక్టర్ ఢీకొనడంతో మహిళకు గాయాలు


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ ముకుందరావు

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలోని వీకేపేట రోడ్‌లో ఒక ట్రాక్టర్ స్కూటీని ఢీకొనడంతో మహిళకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గురువారం అత్యంత రద్దీగా ఉన్న వీకేపేట రోడ్‌లో రత్తకన్న వైపు నుంచి మార్కెట్ వైపు ఒక వ్యక్తి ట్రాక్టర్‌ని వేగంగా నడుపుకుంటూ వస్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న స్కూటీని తప్పించే క్రమంలో ఢీకొన్నాడు. దీంతో స్కూటీ నడుపుతున్న పెద్ద ఆకుల వీధికి చెందిన కిల్లంశెట్టి శరణ్య అనే మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో మెరుగైన చికిత్స కోసం బరంపురం తరలించారు. ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉండడం కారణంగా ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. సమాచారం అందుకున్న పట్టణ ఎస్‌ఐ ముకుందరావు పోలీసు సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ని క్లియర్ చేశారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్ సవరాశి దుడిష్టిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నైపుణ్యాలతో ఉద్యోగ అవకాశాలు


ప్రతిభ కనబర్చిన అభ్యర్థులతో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు

వజ్రపుకొత్తూరు రూరల్: యువతకు నైపుణ్యాలతోనే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని గరుడభద్రలో షైనింగ్ స్టార్ యువజన సంఘం 25వ వార్షికోత్సవంలో భాగంగా రాష్ట్రస్థాయి డీఎస్సీ టాలెంట్ టెస్ట్‌ను గురువారం నిర్వహించారు. ఈ టాలెంట్ టెస్ట్‌లో రాష్ట్రవ్యాప్తంగా 500 మంది అభ్యర్థులు పాల్గొని ఆన్‌లైన్‌లో ప్రతిభ పరీక్ష రాశారు. ఈ పోటీ పరీక్షలో కె.స్వప్న (శ్రీకాకుళం) ప్రతిభ కనబ ర్చి ప్రథమ స్థానంలో నిలిచింది. కె.భారతి(శ్రీకాకుళం) ద్వితీయ స్థానం, ఎస్.శ్యామల(విజయనగరం) తృతీయ స్థానంతో పాటు మరో ఏడు స్థానాల్లో ప్రతిభ కనబర్చిన అభ్యర్థులకు నగదు బహుమతి తో పాటు జ్ఞాపికలను మాజీ మంత్రి చేతులమీదు గా అందజేశారు. కార్యక్రమంలో షైనింగ్ స్టార్ యువజన సంఘ అధ్యక్షుడు వై.సంతోష్‌కుమార్, సర్పంచ్ గూడ గిరిజ ఈశ్వరరావు, షైనింగ్ స్టార్ యువజన సంఘ కార్యదర్శి జి.నగేష్, గ్రామ సంఘ కార్యదర్శి చెల్లూరి పాపారావు, గాయిత్రి కళాశా ల ప్రిన్సిపాల్ షణ్ముఖరావు, జగన్ కోచింగ్ సెంటర్ అధినేత జగన్, గూడ భాస్కరరావు, వై.ధర్మారావు, వై.అప్పారావు, వై.అనందరావు, ఎ.దానేష్ పాల్గొన్నారు.

స్టైఫండ్‌తో కూడిన శిక్షణ

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రి బొల్లినేని మెడిస్కిల్స్ నందు డిగ్రీ చదివిన విద్యార్థులకు స్వల్పకాలిక సర్టిఫికేట్ కోర్సును నిర్వహిస్తున్నట్లు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుకు డిగ్రీ పాసైన లేదా ఫెయిల్ అయిన విద్యార్థులు అర్హులన్నారు. 18 నుంచి 30 సంవత్సరాల్లోపు ఉండాలన్నారు. 6 నెలలు శిక్షణ ఉంటుందన్నారు. ఎంపికైనవారికి శిక్షణలో స్టైఫండ్ అందిస్తామన్నారు. ఈ కోర్సు పూర్తిచేసిన వారికి ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 76809 45357, 79950 13422 నంబర్లను సంప్రదించాలన్నారు.

నాటుసారాతో పట్టుబడిన వ్యక్తి

కవిటి: మండలంలోని బంజుపుట్టుగ తోటల్లో గురువారం మొబైల్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన బంజు శ్యామరావు అనే వ్యక్తిని 100 నాటుసారా ప్యాకెట్లతో పట్టుకున్నామని మొబైల్ టీమ్ సీఐ జీవీ రమణ తెలిపారు. ఈ మేరకు స్వాధీనం చేసు కున్న నాటుసారా ప్యాకెట్లు, సదరు నిందితుడి ని ఎక్సైజ్‌శాఖ సిబ్బందికి తదుపరి చర్యల నిమిత్తం అప్పగించినట్టు తెలిపారు.

అరుదైన శస్త్ర చికిత్స


ఆపరేషన్‌కు ముందు చేయి భాగం


ఆపరేషన్ తర్వాత

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో గురువారం అరుదైన శస్త్ర చికిత్స జరిగింది. గార మండలం అచ్చెన్నపాలెంకు చెందిన శిమ్మ నీలకంఠం వెల్డర్‌గా పనిచేస్తున్నాడు. ఏప్రిల్ 30న పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కటింగ్ మిషన్ చేయిమీదకు రావడంతో కుడిచేయి భాగం తెగిపోయింది. నరాలు తెగిపోవడం, ఎక్కువగా రక్తస్రావం జరగడంతో పనిచేయలేని స్థితికి వచ్చేసింది. విశాఖపట్నంలోని ఒక ఆస్పత్రిని సంప్రదిస్తే సుమారు రూ.3 నుంచి రూ.5 లక్షల వరకూ ఖర్చు అవుతుందని తెలుసుకున్నారు. దీంతో వెంటనే రాగోలు జెమ్స్ ఆస్పత్రిని సందర్శించారు. అక్కడ డాక్టర్ బుల్లి ప్లాస్టిక్ సర్జరీ చేసి ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా అరుదైన ఆపరేషన్‌ను ఉచితంగా నిర్వహించారు. ఈ ఆపరేషన్ చేయడానికి సుమారు 5 గంటల సమయం వెచ్చించినట్లు ఆర్‌ఎంవో మేనేజర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

క్రీడా శిక్షణ శిబిరాలు ప్రారంభం

- జిల్లావ్యాప్తంగా 50 కేంద్రాల్లో శిక్షణ


హాజరైన బాలబాలికలు, కోచ్‌లు


మాట్లాడుతున్న సుందరరావు, పక్కనే సాంబమూర్తి, బీవీ రమణ, డీఎస్‌డీవో శ్రీధర్

శ్రీకాకుళం న్యూకాలనీ: వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు (సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లు) గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శాప్ సూచనలతో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా 50 శిక్షణ శిబిరాల్లో తర్ఫీదు ఇస్తున్నారు. 22 క్రీడాంశాల్లో జరుగుతున్న ఈ శిబిరాల వద్దకు క్రీడాకారులు, బాలబాలికలు తరలివస్తున్నారు. దీంతో క్రీడా మైదానాల్లో సందడి వాతావరణం నెలకొంది. క్రీడాకారులు శారీరక ఫిట్‌నెస్‌తోపాటు నిర్దేశిత క్రీడలో సాధన చేపడుతున్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని కోడిరామ్మూర్తి స్టేడియం వేదికగా వేసవి క్రీడా శిక్షణా శిబిరాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా సీఈవో పి.సుందరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. చదువుతోపాటు క్రీడలు కూడా అవసరమేనన్న విషయాన్ని విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు గుర్తించాలన్నారు. ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సాంబమూర్తి, జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి బీవీ రమణ మాట్లాడుతూ క్రీడాకారులు తయారయ్యేది,ఓనమాలు దిద్దుకునేది వేసవి క్రీడా శిక్షణా శిబిరాలతోనేనని తెలిపారు. డీఎస్‌డీవో డాక్టర్ కె.శ్రీధర్‌రావు మాట్లాడుతూ జిల్లాలో 50 కేంద్రాల్లో సమ్మర్ కోచింగ్ క్యాంపులను నిర్వహిస్తున్నామని, అత్యంత ఆదరణ కలిగిన క్రీడాంశాలకు పెద్దపీట వేశామన్నారు. కేంద్రానికి రూ.7 వేలు చొప్పున శాప్ కేటాయించిందన్నారు. 8 ఏళ్లు పైబడిన బాలబాలికలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా పర్యాటకాధికారి ఎన్.నారాయణరావు, టీటీ కోచ్ ఎం.మాధురీలత, పీడీలు చల్లా జగదీష్, ఎస్‌వీ రమణ, జి.అర్జున్‌రెడ్డి, రాజీవ్, పురుషోత్తం, క్రీడాసంఘాల ప్రతినిధులు, కోచ్‌లు, సీనియ ర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పదోన్నతి నియామక పత్రాల అందజేత



వై.దేవానంద్‌కు నియామక పత్రం అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: జిల్లా పరిషత్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు గురువారం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పదోన్నతి నియామక పత్రాలు అందజేశారు. పార్వతీపురం సబ్‌డివిజన్‌లో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న వై.దేవానంద్‌ను డెంకాడ మండ ల పరిషత్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా నియమించారు. అలాగే జామి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రికార్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న జి.లీలావతికి భైరిపురం జిల్లా పరిషత్ పాఠశాల జూనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పించారు. ఈ మేరకు ఆ ఇద్దరు ఉద్యోగులకు ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తన చాంబర్‌లో నియామకపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ బీవీవీ.సత్యనారాయణ, డిప్యూటీ సీఈఓ ఆర్.వెంకట్‌రామన్‌లు పాల్గొన్నారు.

క్రీడలతోనే మంచి సమాజం

- కేంద్ర మాజీమంత్రి అశోక్ గజపతి రాజు



క్రీడా శిక్షణను ప్రారంభిస్తున్న కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతి రాజు

విజయనగరం: క్రీడలతోనే మంచి సమాజ స్థాపన సాధ్యమవుతుందని కేంద్ర మాజీమంత్రి పూసపాటి అశోక్ గజపతి రాజు అన్నారు. ఈ మేరకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో తలపెట్టిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక విజ్జి మైదానంలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బాడ్మింటన్, బాక్సింగ్, హ్యాండ్‌బాల్, తైక్వాండో క్రీడా శిక్షణ శిబిరాలను ప్రారంభించి మాట్లాడుతూ విద్యార్థులు క్రీడా శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకుని రాణించాలని పిలుపునిచ్చారు. అనంతరం డీఎస్‌డీఓ ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించడం కోసం,విద్యార్థుల్లో ఉన్న క్రీడా ప్రతిభను గుర్తించాలని వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు, శిక్షకులు, వివిధ క్రీడా సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

సాలూరు రూరల్: మండలంలోని కందుల పథం గ్రామంలో గురువారం పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్సై నరసింహమూర్తి తెలిపారు. పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఆ ప్రాంతానికి చేరుకుని పేకాటరాయుళ్లను పట్టుకున్నట్లు ఆయన చెప్పారు. నిందితులతో పాటు 3 మోటార్‌సైకిల్స్, రూ.26,190 నగదు సీజ్ చేశామన్నారు.

ఫలితాలు 'ఆదర్శ' నీయం



సతివాడ ఆదర్శ పాఠశాల

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశాలకు నిర్వహించిన పరీక్షల్లో గ్రామీణ విద్యార్థులు సత్తా చాటారు. ఫలితాల వివరాలను పాఠశాల నోటీస్ బోర్డులో గురువారం పెట్టారు. రుషాంత్ అనే విద్యార్థి 100కు 92 మార్కులు సాధించి ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. అంబళ్ల సూర్యతేజశ్విని-89, ముడి వాసు-86, రౌతు ప్రేమ్‌సాయి-85, సత్యగాయత్రి-84, యడ్ల కృపాంజలి-82, యామిని- 81 మార్కులతో వరుసగా ఏడు ర్యాంకులు సాధించారు. పరీక్షకు హాజరైన 444 మందిలో 104 మంది విద్యార్థులు 60కు పైగా మార్కులు సాధించారు. నిబంధనల ప్రకారం విద్యార్థుల ఎంపిక ప్రక్రియ ఉంటుందని ప్రిన్సిపాల్ శైలజ తెలిపారు.

చెట్టుపై నుంచి జారిపడిన వ్యక్తి మృతి

దత్తిరాజేరు: మండలంలోని గడసాం గ్రామంలో చింత చెట్టుపై నుంచి జారిపడిన మజ్జి రామునాయుడు (35) గురువారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామ సమీపంలో ఉన్న చింత చెట్టు నుంచి కాయలు కోస్తుండగా జారి పడడంతో రామునాయుడుకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. నాలుగేళ్ల కిందట కుమారుడు చెరువులో పడి మృతిచెందగా.. ఇప్పుడు భర్త చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందడంతో భార్య గంగ కన్నీటిపర్యంతమవుతోంది. కుమార్తె హారికకు దిక్కెవరంటూ రోదిస్తోంది. కేసు నమోదుచేసినట్లు పెదమానాపురం ఎస్‌ఐ తెలిపారు.

రేషన్ ఈకేవైసీ పూర్తయ్యేదెప్పుడో?

- చేయాల్సిన లబ్ధిదారులు 16,30,409 మంది
- ఇంతవరకు చేసింది15,34,543 మంది
- ఐదేళ్ల లోపు చేయించుకోవాల్సిన వారు 25, 332 మంది
- 80 ఏళ్లు దాటిన వారు 1042 మంది



ఎస్.కోట మండలం వేమలాపల్లిలో రేషన్ కోసం బయోమెట్రిక్ వేస్తున్న మహిళ

విజయనగరం ఫోర్ట్: రైస్ కార్డు దారులకు ఈకేవైసీ చేయడం ఇప్పట్లో పూర్తయ్యేలా కనిపించడం లేదు. గత కొన్నేళ్లుగా ఈ ప్రక్రియ కొనసాగుతున్నప్పటికీ ఇంతవరకు శతశాతం కాలేదు. వేలాదిమంది ఇంకా ఈకేవైసీ చేయించుకోలేదు.ఈకేవైసీ చేయించుకోకపోతే రేషన్ అందదు. అయినప్పటికీ ఇంకా చాలా మంది ఈకేవైసీ చేయించుకోలేదు. ఈకేవైసీ చేసేవారికి లబ్ధిదారులు ఎవరో తెలియకపోవడం, కొంత మంది వలస వెళ్లిపోవడం తదితర కారణాల వల్ల ఇంకా చాలామంది ఈకేవైసీకి దూరంగా ఉన్నారు.

ఈకేవైసీ ఎక్కువగా పెండింగ్ ఉన్న మండలాల వివరాలు:

మండలం	లబ్ధిదారుల సంఖ్య
విజయనగరం	10,322
రాజాం	4341
బొబ్బిలి	3332
ఆర్.ఆమదాలవలస	3047
నెల్లిమర్ల	2768
చీపురుపల్లి	2734
గరివిడి	2684
సంతకవిటి	2618
గుర్ల	2595
మెరకముడిదాం	2470
ఎస్.కోట	2458
భోగాపురం	2455
జామి	2348
కొత్తవలస	2343
పూసపాటిరేగ	2321
డెంకాడ	2257
గంట్యాడ	1941
వంగర	1878
తెర్లాం	1846
వేపాడ	1841

16,30,409 మందికి చేయాలని లక్ష్యం

జిల్లాలో 16,30,409 మంది రైస్ కార్డు లబ్ధిదారులు ఉన్నారు. వారందరికీ ఈకేవైసీ చేయాల్సి ఉంది. అయితే వారిలో ఇప్పటివరకు 15,34,543 మందికి ఈకేవైసీ అయింది. ఇంకా 69,492 మంది చేయించుకోవాల్సి ఉంది. వారిలో ఐదేళ్ల లోపు వారు 25,332 మంది ఉన్నారు. అదేవిధంగా 1042 మంది 80 ఏళ్లు దాటిన వారు ఉన్నారు. ఐదేళ్లు పైబడి 80 ఏళ్ల లోపు వారు 43,118 మంది చేయించుకోవాల్సి ఉంది.

గతంలో వలంటీర్లు చేసేవారు

ఈకేవైసీని రైస్ కార్డు లబ్ధిదారులకు గతంలో వలంటీర్లు చేసేవారు. వారి పరిధిలో ఉన్న వారికి సులువుగా పూర్తి చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వలంటీర్లకు మంగళం పాడడంతో ఆప్రక్రియను రేషన్ డీలర్లకు అప్పగించారు. రేషన్ డీలర్లు గ్రామానికి ఒకరు, ఇద్దరు ఉండడంతో వారికి ఈప్రక్రియ కాస్త ఇబ్బందిగానే ఉంది. దీనివల్ల ఈకేవైసీ ప్రక్రియ శతశాతం పూర్తయ్యే సూచనలు కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

జూన్ 30 వరకు గడువు

రైస్‌కార్డు దారులకు ఈకేవైసీ 94.12 శాతం అయింది. జిల్లాలో ఈకేవైసీ బాగానే జరుగుతోంది. ఈకేవైసీ చేయించుకోవడానికి గడువు జూన్ 30 వరకు పెంచారు.

కె.ముధుసూదన్ రావు,
జిల్లా పౌరసరఫరాల అధికారి

మాజీ ఎమ్మెల్యే పెద్ద మనసు

- రోడ్డు ప్రమాద బాధితులకు సపర్యలు
- దగ్గరుండి ఆస్పత్రికి తరలింపు



ఘటనా స్థలంలో 108 వాహనం కోసం ప్రయత్నిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

పాలకొండ రూరల్: మండలంలోని పనుకువలసకు చెందిన టి.మన్మథరావు, ఎస్.విశ్వనాథం గురువారం తమ సొంత పనులమీద ద్విచక్ర వాహనంపై వీరఘట్టం వైపు పయనమయ్యారు ఈ క్రమంలో గ్రామ సమీపంలో వాహనం అదుపు తప్పి ప్రమాదానికి గురై గాయపడ్డారు. వారిద్దరూ ప్రధాన రహదారిపై రక్తమోడుతూ అపస్మారక స్థితికి చేరుకున్నారు. ఆ సమయంలో పాలకొండ వస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి క్షతగాత్రులను గుర్తించి తన వాహనం నిలిపి క్షతగాత్రులకు తన తల్లి మనసు చూపించి తక్షణ సపర్యలు అందజేశారు. అటుగా వస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారిని ఆపి బాధితులకు సేవలు అందించాలని కోరారు. క్షతగాత్రులను పరిశీలించిన వైద్యాధికారి వారిని ఆస్పత్రికి తరలించాలని సూచించారు. 108 వాహనానికి మాజీ ఎమ్మెల్యే కళావతి ఫోన్ చేయగా వాహనం పార్వతీపురం దగ్గరలో ఉండడంతో అందుబాటులోకి రాలేదు. దీంతో ప్రత్యేకంగా ఆటోలో బాధితులను పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించే ఏర్పాటు చేశారు. అనంతరం కళావతి కూడా ఆస్పత్రికి చేరుకుని వైద్యులతో మాట్లాడి బాధితులకు మెరుగైన సేవలందించాలని కోరారు. ప్రస్తుతం బాధితులు కోలుకుంటున్నారు. సరైన సమయంలో స్పందించిన మాజీ ఎమ్మెల్యే కళావతి బాధితులను రక్తమోడిన గాయాలతో బాధపడుతుండగా ఆమె కళ్లు చెమర్చాయని, మానవత్వం చాటుకున్నారని ఘటనాస్థలంలో ఉన్నవారు చర్చించుకున్నారు.

మందుగుండు గోదాములపై దాడులు

- పోలీస్ అధికారులకు ఎస్పీ ఆదేశాలు



మందుగుండు గోదాములను తనిఖీ చేస్తున్న పోలీసులు

విజయనగరం క్రైమ్: జిల్లా కేంద్రంలోని జెడ్పీలో జరిగిన అగ్నిప్రమాదంతో పోలీసులు అలెర్ట య్యారు. ప్రమాదానికి గల కారణం షార్ట్ సర్క్యూట్ అయినప్పటికీ వేసవికాలం దృష్ట్యా ఎలాంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా మందుగుండు గోదాములను తనిఖీ చేయాలని ఎస్పీ వకుల్ జిందల్ గురువారం ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఆయా స్టేషన్‌హౌస్ ఆఫీసర్లు మందుగుండు గోదాములను చెక్‌చేశారు. లైసెన్స్‌డ్ గోదాములను చెక్‌చేసిన పోలీసులు మందుగుండు సామగ్రి నిల్వలు, భద్రతా ప్రమాణాలు,వంటి అంశాలను నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ అనధికారికంగా లైసెన్స్ లేని మందుగుండు గోదాములపై కేసులు పెట్టాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఒకవేళ అగ్ని ప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన చర్యలు, పాటించవలసిన ప్రమాణాలను గోదాములు నిర్వహిస్తున్న యజమానులకు వివరించాలని చెప్పారు. జిల్లావ్యాప్తంగా గోదాములలో జరిగే తనిఖీలను బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి, చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు పరిశీలించాలని ఎస్పీ ఆదేశించారు.

ముగ్గురు సైబర్ నేరగాళ్ల అరెస్ట్

- వివరాలు వెల్లడించిన డీఎస్పీ



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాంబాబు

పాలకొండ: ఇటీవల సైబర్ క్రైమ్ కేసులను పోలీసులు త్వరగా ఛేదించి మన్ననలు అందుకుంటున్నారు. పాలకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన పలు సైబర్ నేరాలను ఇప్పటికే ఛేదించిన పోలీసులు తాజాగా ఫోన్ దొంగిలించి అందులోని ఫోన్‌పే ద్వారా డబ్బులు కాజేస్తున్న ముఠాను పట్టుకున్నారు. ఆ ముఠాలోని పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. ఈ మేరకు ఆ వివరాలను డీఎస్పీ ఎం.రాంబాబు గురువారం విలేకరుల సమావేశంలో వివరించారు. గత ఏడాది నవంబర్ నెలలో తన ఫోన్ దొంగిలించి ఫోన్‌పే ద్వారా డబ్బులు కాజేస్తున్నారని భామిని మండలానికి చెందిన బోదేపు నారాయణరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పాలకొండలో పనులు పూర్తి చేసుకుని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సుకోసం వేచి ఉన్న సమయంలో ఫోన్ దొంగతనానికి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు సైబర్ క్రైమ్ టీమ్‌ను అప్రమత్తం చేసి ఖాతాలో ఉన్న మిగతా మొత్తం విత్‌డ్రా చేయకుండా చర్యలు తీసుకున్నారు. అనంతరం అప్పటికే ఫోన్‌పే ద్వారా రూ.92, 200 డ్రా చేయడంతో దాని ఆధారంగా కేసు దర్యాప్తు చేపట్టారు. నిందితులు చిలకపాలెం పెట్రోల్ బంక్‌లో ఫోన్‌పే చేసి డబ్బులు తీసుకున్నట్లు గుర్తించారు. ఇలా పలు చోట్ల ఫోన్ పే చేస్తాం డబ్బులు కావాలని అడిగి నగదు తీసుకున్నారు. దీంతో సీఐ చంద్రమౌళి ఆధ్వర్యంలో సాంకేతికను ఉపయోగించి నిందితులు తిరుగుతున్న ప్రాంతాలను గుర్తించారు. బుధవారం మరోసారి నిందితులు పాలకొండ వచ్చి ఒక లాడ్జిలో బస చేయడంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు. నిందితుల్లో పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన మేకల వెంకటేష్, విజయనగరం జిల్లాకు చెందిన పసుపురెడ్డి గోపీచందు, పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన మహమ్మద్ బాషాలను అరెస్టు చేశారు. నిందితుల నుంచి మూడు సెల్‌ఫోన్లు, రూ.92, 200 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు దర్యాప్తులో కీలకంగా వ్యవరించిన సీఐ, ఎస్సై, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

ఈఎంఆర్ఎస్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం: ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో(ఈఎంఆర్ఎస్) 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 7,8,9 తరగతుల లో ఆంగ్లమాధ్యమంలో ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గిరిజన సంక్షేమ ఉపసంచాలకురాలు ఆర్.కృష్ణవేణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆయా పాఠశాలల్లో మే 10లోగా దరఖాస్తు చేయాలని సూచించారు. మే 11న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు ఆయాపాఠశాలల ప్రిన్సిపాల్స్‌ను సంప్రదించాలన్నారు.

ఖాళీల వివరాలు

- ఈఎంఆర్ఎస్, అనసభద్రలో 7వ తరగతిలో బాలురు-3, 8వ తరగతిలో బాలికలు-2, బాలురు-3, 9వ తరగతిలో 3 ప్రవేశాలున్నాయి.
- ఈఎంఆర్ఎస్, జీఎల్ పురం పాఠశాలలో 7వ తరగతిలో బాలురు-3, 9వ తరగతిలో బాలురు-2 ప్రవేశాలున్నాయి.
- ఈఎంఆర్ఎస్,కొటికపెంట పాఠశాలలో 7వ తరగతిలో బాలికలు-1,బాలురు-2, 8వ తరగతిలో బాలురు-2, ప్రవేశాలున్నాయి.
- ఈఎంఆర్ఎస్, కురుపాం పాఠశాలలో 7వ తగరతిలో బాలికలు-1, బాలురు-4, 8వ తరగతిలో బాలురు-1, 9వ తరగతిలో బాలికలు-1, బాలురు-2 ప్రవేశాలున్నాయి.

లైంగిక దాడి కేసులో ముద్దాయికి జైలుశిక్ష

విజయనగరం క్రైమ్: మూడేళ్ల క్రితం జరిగిన లైంగిక దాడి కేసులో ముద్దాయికి ఏడాది జైలుశిక్ష, రూ.10,000 జరిమానా విధిస్తూ విజయనగరం మహిళా జడ్జి పద్మావతి గురువారం తీర్పు ఇచ్చినట్లు విజయనగరం మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్సై నరసింహారావు చెప్పారు. 2022లో రాజాం మండలం పొగిరికి చెందిన టంకాల శంకరరావు అదే గ్రామానికి చెందిన ఒక మహిళను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడని ఎస్సై చెప్పారు. అప్పటి దిశ పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేయగా ఎస్సై లక్ష్మి కేసు నమోదు చేశారని, సీఐ శేషు దర్యాప్తు చేపట్టి నిందితుడ్ని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించగా రిమాండ్‌లో ఉన్నాడన్నారు.

పంటల సాగుకు ముందస్తు ప్రణాళికలు అవసరం

- జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్

గరుగుబిల్లి: ఖరీఫ్‌లో పంటల సాగుకు ముందస్తు ప్రణాళికలు అవసరమని పార్వతీపురం మన్యం జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన తోటపల్లిలోని జట్టు ట్రస్టు ప్రాంగణంలో కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, గరుగుబిల్లి మండలాలకు చెందిన ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలకు ఖరీఫ్ పంటలప్రణాళిక తయారీ, నవధాన్యాల సాగు తదితర అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుతుపవనాలు రావడానికి నెల రోజుల ముందు నవధాన్యాలు సాగుచేసుకోవాలని సూచించారు. ప్రధాన పంటను సాగుచేయడానికి ముందు నవధాన్యాలు సాగుచేసుకుంటే భూమికి కావాల్సిన పోషకాలు అందుతాయని చెప్పారు. నవధాన్యాల కిట్లు రైతు సేవాకేంద్రాల్లో అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. డీపీఎం షణ్ముఖరాజు మాట్లాడుతూ భూములకు భూపరీక్షలను చేయించుకుంటే పోషకాల లోపాలను గుర్తించేందుకు అవకాశం ఉంటుందన్నారు. రీజినల్ టెక్నికల్ అధికారి జి.హేమసుందర్ మాట్లాడుతూ ఏడాదంతా భూమిపై పంటలు పండించేలా ప్రణాళిక చేసుకుంటే బహుళ ప్రయోజనాలు కలుగుతాయని చెప్పారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి విజయభారతి, జట్టు డైరెక్టర్ ప్రహరాజ్, రైతు సాధికార సంస్థ ప్రతినిధి బి.భాను తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం తయారీ కేంద్రాలపై దాడులు



అక్రమ మద్యం తయారీ కేంద్రాలపై దాడి చేసిన ఎక్సైజ్ అధికారులు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలో అక్రమంగా మద్యం తయారు చేస్తున్న శిబిరాలపై పెద్దఎత్తున దాడి నిర్వహించినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ బి.శ్రీనాథుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ మద్యం, సారా తయారీని నివారించేందుకు నిరంతరం చర్యలు తీసుకుంటున్న ఎక్సైజ్ శాఖ, ఒడిశా ఎక్సైజ్ అధికారులతో కలిసి గురువారం బందుగాం బ్లాక్‌లోని అత్తిగుడ, చైన బంకిడి, ఎగువబద్ద గ్రామాల్లో ఏకకాలంలో పెద్ద ఎత్తున దాడి చేశామన్నారు. ఈ దాడిలో 10,800 లీటర్ల ఎఫ్‌జే వాష్, 40 లీటర్ల ఐడీ లిక్కర్, 200 కిలోల బ్లాక్ జాగరి, 40 కిలోల అమ్మోనియాను పట్టుకుని ధ్వంసం చేసినట్లు తెలిపారు. అక్రమ మద్యం తయారీకి సంబంధించిన క్రాస్-బోర్డర్ కార్యకలాపాల గురించి ఇంటెలిజెన్స్ సమాచారం ఆధారంగా ఈ రైడ్ నిర్వహించామని, ఈ పదార్థాల నుంచి ప్రమాదకరమైన నకిలీ మద్యం తయారు చేసి ప్రాణనష్టానికి కారకులవుతున్నారన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో మరింత విజిలెన్స్ పెంచి, అక్రమ మద్యం తయారీని పూర్తిగా నిర్మూలించడానికి సంయుక్త ఆపరేషన్లు కొనసాగిస్తామని చెప్పారు. ఈ ఆపరేషన్‌లో పార్వతీపురం, సీతానగరం, బొబ్బిలి, సాలూరు ఎస్‌హెచ్‌ఓ బృందాలు, బీఎంపీపీ సాలూరు, ఈఎస్‌టీఎఫ్ విజయనగరం, ఒడిశా ఎక్సైజ్ అధికారులు మొత్తం 27 మంది పాల్గొన్నట్లు తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి మృతి



చెరువు సమీపంలో గంగునాయుడు మృతదేహం

కొత్తవలస: మద్యానికి బానిసై విపరీతంగా తాగుతూ అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం పెదనందిపల్లి గ్రామానికి చెందిన పల్లా గంగునాయుడు(45) మృతిచెందిన విషయం ఆలస్యంగా గురువారం వెలుగుచూసింది. ఈ ఘటనకు సంబంధించి కొత్తవలస సీఐ షణ్ముఖరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గంగునాయుడు, భార్య 15 సంవత్సరాల క్రితం మనస్పర్థలతో విడిపోయారు. దీంతో నాటి నుంచి ఆకతాయిగా తిరుగుతూ ఎక్కడైనా గొర్రెల మందలు ఉంటే వారి వద్దకు వెళ్లి అక్కడే ఉంటూ వారు పెట్టింది తింటూ ఉండేవాడు. ఈ క్రమంలో గంగునాయుడు ఆదివారం ఇంటి నుంచి వచ్చేసి కొత్తవలస మండలం గులివిందాడ గ్రామం సమీపంలో గల చెరువు దగ్గర గల గొర్రెల మంద వద్దకు వెళ్లాడు. తనవెంట తెచ్చుకున్న రెండు మద్యం సీసాల్లో ఒకటి పూర్తిగా తాగి పడిపోయాడు. దానికి తోడు విపరీతంగా కాస్తున్న ఎండ బారిన పడి మృతి చెందినట్లు సీఐ తెలిపారు. చెరువు వైపు వెళ్లిన పశువుల కాపరలు మృతదేహాన్ని చూసి గ్రామస్తులకు తెలపడంతో పోలీసులకు సమాచారం అందించారన్నారు. మృతుడి తమ్ముడు సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం ఎస్.కోట సీహెచ్‌సీకి మృతదేహాన్ని తరలించినట్లు సీఐ వివరించారు.

గంగపుత్రుల బెంగ..!

- ఫ్లోటింగ్ జెట్టీ నిర్మాణానికి గ్రహణం
- గతంలోనే రూ.23 కోట్లు మంజూరు
- శంకుస్థాపన చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- అధికారంలోకి వచ్చి 11 నెలలవుతున్నా ఊసెత్తని కూటమి
- అవస్థలు పడుతున్న గంగపుత్రులు



జెట్టీ లేకపోవడంతో చింతపల్లితీరంలో ఒడ్డున నిలిపిన పడవలు

పూసపాటిరేగ: జిల్లాలోని తీరప్రాంతం చింతపల్లికి మంజూరైన ఫ్లోటింగ్ జెట్టీ నిర్మాణానికి గ్రహణం పట్టింది. పది నెలల క్రితం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో చింతపల్లికి రూ.23 కోట్లుతో జెట్టీని మంజూరు చేశారు. అన్ని అడ్డంకులు తీరి ఆర్థికశాఖ అనుమతులు వచ్చిన తరువాత అప్పట్లో సీఎంగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో ఫ్లోటింగ్ జెట్టీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదినెలలవుతున్నా ఫ్లోటింగ్ జెట్టీ నిర్మాణం ఊసెత్తలేదు. జిల్లాలో తీరప్రాంత మత్స్యకారులు ప్రధాన అవసరమైన ఫ్లోటింగ్ జెట్టీ నిర్మాణంపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జెట్టీ నిర్మాణం కాకపోవడం, తరచూ తుఫాన్ హెచ్చరికలు జారీ అవడం వంటి కారణాలతో తీరప్రాంతం వీడి సుమారు 3 వేల మంది మత్స్యకారులు వలసబాట పట్టారు. జిల్లాలో తీరప్రాంతమైన పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో సుమారు 21 వేల మంది మత్స్యకారులు జీవిస్తున్నారు. వారిలో 6 వేల మంది చేపల వేటనే ప్రధాన వృత్తిగా చేసుకుని జీవిస్తున్నారు. వారిపై పరోక్షంగా 15 వేల మంది ఆధారపడి ఉన్నారు. పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో 885 బోట్లలో సుమారు 3798 మంది మత్స్యకారులు నిత్యం వేటను సాగిస్తుంటారు. వేటలేక వివిధ కారణాల రీత్యా మరో 3 వేల మంది మత్స్యకారులు బతుకు తెరువు కోసం విశాఖ, గుజరాత్ , హీరావళి, సూరత్ తదితర ప్రాంతాలకు వలస వెళ్లారు. తీరంలో జెట్టీ లేకపోవడంతో విపత్తుల సమయంలో పడవలు, వలలు సముద్రంలో కొట్టుకుపోయి నష్టాలు చవిచూస్తున్నామని పలువురు మత్స్యకారులు వాపోతున్నారు.

కాలుష్యంతో మత్స్యసంపద నాశనం

జెట్టీ సమస్యతో పాటు పరిశ్రమల వ్యర్థజలాలు తమ పొట్టలు కొడుతున్నాయని మత్స్యకారులు వాపోతున్నారు. రసాయన పరిశ్రములు వ్యర్థజలాలను సముద్రంలో కలిపేయడంతో మత్స్య సంపదకు తీవ్ర నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో చేపల వేటకు వెళ్తే భారీగా వలకు చేపలు చిక్కేవని నేడు ఆ పరిస్థితి లేదని చెబుతున్నారు. వేట సాగక పోవడంతో వలస వెళ్లే పరిస్థితి అని మత్స్యకారులు వాపోతున్నారు

తక్షణమే ఫ్లోటింగ్ జెట్టీ నిర్మించాలి

జెట్టీ లేకపోవడంతో వేట చేసిన తరువాత ఒడ్డుకు చేరిన పడవలకు రక్షణ లేకుండా పోయింది. ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు తీవ్ర నష్టాలు చవిచూస్తున్నాం. గత ప్రభుత్వంలో జెట్టీ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి శంకుస్థాపన చేశారు. కూటమి ప్రభుత్వం జెట్టీ నిర్మాణంపై నిర్లక్ష్యం చేయకుండా నిర్మాణంపై తక్షణమే దృష్టిసారించాలి. బి.కొర్లయ్య, చింతపల్లి మత్స్యకారుడు.

మత్స్యకారులు అభివృద్ధి చెందాలి

అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఫ్లోటింగ్ జెట్టీ నిర్మాణాన్ని ప్రారంభించే దిశగా చర్యలు చేపట్టాలి. జెట్టీ నిర్మాణం పూర్తి చేసి మత్స్యకారులు జీవనోపాధి మెరుగుపరచాలి. బి. అప్పలస్వామి, మత్స్యకారుడు పతివాడ బర్రిపేట.

భూ ఆక్రమణలపై జోక్యం చేసుకోవాలి

- ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు గిరిజనుల వినతి

విజయనగరం అర్బన్: అనంతగిరి మండలం బీంపోలు పంచాయతీ సరియాపల్లి గ్రామ ప్రజల భూఆక్రమణలపై జోక్యం చేసుకుని న్యాయం చేయాలని కోరుతూ ఆ గ్రామస్తులు రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావును కలిసి గురువారం వినతిపత్రం అందజేశారు.తమ భూమి గిరిజనేతరుల ఆక్రమణకు గురైందని వాపోయారు. దీనిపై స్పందించిన ఎస్టీ కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కమిషన్ చైర్మన్‌ను కలిసిన వారిలో మాజీ సర్పంచ్ ఎం.అప్పలకొండ, ఎంపీటీసీ అశోక్, సతీష్ తదితరులు ఉన్నారు.

వ్యక్తి అదృశ్యం

వంగర: మండల పరిధి ఎం.సీతారాంపురం గ్రామానికి చెందిన సాకేటి లక్ష్మణరావు (47) అదృశ్యమైనట్లు ఎస్సై షేక్ శంకర్ తెలిపారు. వంగరలో హెచ్‌పీ గ్యాస్ ఆఫీస్‌లో వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్న లక్ష్మణరావు మూడు రోజుల క్రితం అదృశ్యమైనట్లు ఆయన భార్య సాకేటి సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.